జిల్లాలో తీర ప్రాంత విస్తీర్ణం 193 కి.మీ. | మండలాలు 11 | మత్స్యకార గ్రామాలు 154 | తీరానికి దగ్గరలో ఉన్న ఇతర గ్రామాలు 130 | జనాభా 7 లక్షలు | సామాజిక అటవీ ప్రాంతం 14 వేల హెక్టార్లు | తీర ప్రాంత చిత్తడి నేలల విస్తీర్ణం 8వేల హెక్టార్లు | రొయ్యల చెరువుల విస్తీర్ణం 12వేల హెక్టార్లు

కడలి అంచున కలవరం..!

● కోతకు గురవుతున్న తీరం ● రక్షణ చర్యలు కరవు

భూతాపం పెరగడం, వాతావరణంలో మార్పులు, మానవ చర్యల ఫలితంగా తీర ప్రాంత గ్రామాలు ప్రమాదకర స్థితిలోకి వెళ్లే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ జియోఫిజిక్స్ విభాగం చేపట్టిన అధ్యయనంలో జిల్లాలో 25 కి.మీ. మేర తీర ప్రాంత భూభాగం ప్రమాదంలో ఉందని తేలింది. సముద్రపు గాలులను నిలువరించి ఇసుక కోతను అరికట్టే సరుగుడు వనాలు, తాటిచెట్లు, మొగలి పొదలు, ఇతర తోటలను ధ్వంసం చేయడం, చిత్తడి నేలల్ని పరిరక్షించకపోవడమే కారణమని విశ్లేషించారు. తుపానులతో గుణపాఠం నేర్చుకున్న ఒడిశా పాలకులు అక్కడ తీరం భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇక్కడ విపత్తుల సమయంలో హడావుడి చర్యలు తప్ప రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ముప్పు ముంగిటకు సిక్కోలు తీరం చేరే పరిస్థితి తలెత్తింది.

– న్యూస్‌టుడే, సోంపేట

★ సునామీ సమయంలో తీరం రక్షణకు ఇచ్చిన హామీలు రెండున్నర దశాబ్దాలు దాటినా కార్యరూపంలోకి రాలేదు. 1999 నుంచి 2018 వరకు ప్రతి రెండేళ్లకు ఒకసారి విపత్తులు సంభవిస్తూనే ఉన్నాయి. పైలిన్, హుద్‌హుద్, తిత్లీ తుపానులు జిల్లాను అతలాకుతలం చేశాయి.

ముంచెత్తుతున్న అలలు

తీరానికి సమీపంలో 1.25 లక్షల ఎకరాల్లో కొబ్బరి, జీడి, ఇతర ఉద్యాన తోటలు, 1.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వీటి ఆధారంగా ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారు. సముద్రంలో నెలకొన్న పరిస్థితులు ఉద్యాన తోటలు, పంట పొలాలపై తీవ్ర ప్రభావం చూపుతుండటంతో ఆర్థిక స్థితి గణనీయంగా దిగుజారుతోంది. తుపానుల నేపథ్యంలో వీచే గాలుల తీవ్రతను తగ్గించే పరిస్థితి తీరంలో లేకపోవడంతో అవి నేరుగా భూతలాన్ని తాకుతున్నాయి. ఉద్యాన, వ్యవసాయ పంటలు ధ్వంసమవుతున్నాయి. అలల తాకిడి అధికమవుతుండటంతో తీర ప్రాంతం భారీగా కోతకు గురై గ్రామాల్లోకి సముద్రం చొచ్చుకొస్తోంది.

★ రణస్థలం, ఎచ్చెర్ల, గార మండలాల పరిధిలో పరిశ్రమల రసాయనాలు సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ఇనిజాలు, ఇతర అవసరాలకు గార, శ్రీకాకుళం, రణస్థలం, తదితర మండలాల పరిధిలో గ్రామాలకు రక్షణ గోడల్లా ఉన్న ఇసుక తిన్నెల్ని తొలగిస్తున్నారు. ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు 11 మండలాల పరిధిలో 5 వేల హెక్టార్లకు పైగా తీర ప్రాంత భూములు ఆక్రమించి రొయ్యల చెరువులు, తోటలు, పొలాలు, వివిధ నిర్మాణాలతో ముప్పు పొంచి ఉంది.

★ తీరానికి 500 మీటర్ల పరిధిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదన్న నిబంధనలు విస్మరించడం, రొయ్యల చెరువుల సాగు, ఇతర చర్యలు భద్రతను ప్రశ్నార్థకంగా మార్చాయి. 50 మత్స్యకార గ్రామాలు తీరానికి దగ్గరలో ఉన్నాయి. గత ప్రభుత్వం పేదల ఇళ్లకు కేటాయించిన కాలనీ స్థలాలు సముద్రానికి మరింత సమీపంలో ఇవ్వడం గమనార్హం. అలల తాకిడిని తగ్గించి తీరం కోతను అరికట్టే మడ అడవులు, సరుగుడు, మొగలి పొదలు దాదాపుగా మాయమయ్యాయి. ఖరీఫ్‌లో సముద్రం 300 మీటర్ల వరకు ముందుకొచ్చి తీరం భారీగా కోతకు గురైంది.

వనాలు పెంచకపోతే వినాశనమే

తీరానికి కనీసం కి.మీ విస్తీర్ణంలో మడ అడవులు, సరుగుడు, ఇతర చెట్లు పెంచడానికి తక్షణ చర్యలు తీసుకుంటే గాలుల తీవ్రత తగ్గించేందుకు, కోత నివారణకు అవకాశం ఏర్పడుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే వినాశనం తప్పదు. జీవన విధానంలో మార్పు, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడితే కొంతమేర ఉపశమనం కలుగుతుంది.

– జె.జగన్నాథరావు, భూవిజ్ఞాన శాస్త్రవేత్త,

నివేదికలపై స్పందన శూన్యం

గత 15 నెలలుగా సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల కంటే ఎక్కువగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. పోటుపాట్ల సమయంలో కెరటాలు ఏడు అడుగులకు పైగా ఎగిసిపడుతున్నాయి. 2030 నాటికి తీరంలో పలు గ్రామాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ సంస్థలు, నిపుణులు, శాస్త్రవేత్తలు ఇచ్చిన నివేదికలపై స్పందన లేదు.

– ఎం. బాబూరావు, విశ్రాంత సీనియర్ శాస్త్రవేత్త

తిత్లీ తుపాను సమయంలో బారువకొత్తూరు గ్రామం వద్దకు చొచ్చుకొచ్చిన సముద్రం

ఈనాడు శ్రీకాకుళం

విద్యుద్దీప కాంతుల్లో కొత్తమ్మ తల్లి ఆలయ రాజగోపురం

ప్రభుత్వం రాష్ట్ర పండగగా గుర్తించిన నేపథ్యంలో అధికారులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు, బంధువులు, స్వగ్రామాలకు తరలివస్తుండటంతో నందడి నెలకొంది.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

దేవస్థానం ప్రాంగణంలో..

జాతరకు సర్వం సిద్ధం

కోరిన కోర్కెలు తీర్చే కొత్తమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధమైంది. కోటబొమ్మాళిలో వచ్చే నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలు, అయిదంతస్తుల రాజగోపురం, ప్రాంగణం విద్యుద్దీప కాంతుల్లో కళకళలాడుతున్నాయి. జాతరను

లోపలికి వెళ్లే మార్గంలో..

మాకివలస సమీపంలో కుప్పకూలిన మూడు కాలువల సముదాయం

కుప్పకూలిన కాంప్లెక్స్

11ఆర్ కిల్లం కాలువ దిగువ 4,800 ఎకరాల మేరకు ఆయకట్టు ఉండగా మాకివలస సమీపంలో మూడు కాలువల కాంప్లెక్స్ ఇటీవల కుప్పకూలింది. దీని ద్వారా 12బీ మబగాం, కిల్లం ఛానల్, సమదలబట్టికి సాగునీరు సరఫరా అయ్యేది. 11ఆర్ కిల్లం కాలువ అధునికీకరించక పోవడంతో రైతులు ఏటా ఆందోళన చేస్తున్నారు. పలుమార్లు మూడు కాలువల కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేయాలని కోరినా ఆధునికీకరణలో మంజూరు కావడంతో పనులు చేయలేదు. ఇది కూలిపోవడంతో నీటి ప్రవాహం అస్తవ్యస్తంగా మారిందని రైతులు వాపోతున్నారు.

నెరవేరని లక్ష్యం..!

● కొలిక్కిరాని వంశధార కాలువల అభివృద్ధి పనులు
● సాగునీటికి తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, నరసన్నపేట

వంశధార కాలువల ద్వారా సాగునీరందక చివరి భూముల రైతులకు అవస్థలు తప్పడం లేదు. 2008లో అప్పటి ప్రభుత్వం తలపెట్టిన ఓపెన్‌హెడ్ కాలువల ఆధునికీకరణ పనుల లక్ష్యం గురి తప్పింది. కాలువలు అభివృద్ధి చేస్తేనే సత్ఫలితాలు ఉంటాయని ఇంజినీర్లు తేల్చి చెప్పడంతో రెండేళ్ల పాటు పనులు ప్రారంభం కాలేదు. 2011లో కెనాల్ నెట్‌వర్క్ సిస్టం పేరిట వంశధార నదికి ఎడమ వైపు 5, కుడివైపు ఒకటి, మొత్తం 11 కాలువలను ఆధునికీకరించాలని ప్రతిపాదించారు. తద్వారా 68,768 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని అందులో పేర్కొన్నారు. రూ.74.40 కోట్లతో ఆయా పనులు చేపట్టడానికి 2014 జూన్‌లో పరిపాలనా ఆమోదం ఇచ్చింది. వెంటనే ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి చేయకపోవడం గమనార్హం.

★ వంశధార కాలువల ఆధునికీకరణ ప్రక్రియలో భాగంగా 213 కి.మీ. మేర మట్టి పనులు, 536 నిర్మాణాలు చేపట్టాలి. రూ.50 కోట్ల మేర కాలువల నిర్మాణ పనులకు ఖర్చు కాగా, రూ.20 కోట్లతో పలు నిర్మాణాలు చేయాల్సి ఉంది.

★ పనులు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగిరికటకం, మబగాం, జలుమూరు, లుకలాం, పోలాకి, బైరి ఓపెన్‌హెడ్, వంశధార పరిధిలో కాలువలు 8ఆర్ బొడ్డపాడు, 9ఆర్ పర్లాం, 20ఆర్ కూర్మనాథపురం, 24ఆర్ ఎస్సీసీ, 8ఆర్ నడగాం, 7ఆర్ ఉర్లాం, 8ఆర్ దేవాది, 11ఆర్ కిల్లం, 11టీఈ ఉరజాం, 16టీఈ పోలాకి తదితర కాలువలపై చేసిన పనులతో ఆశించిన ఫలితాలు చేకూరలేదన్న విమర్శలు ఉన్నాయి.

దేవాది వద్ద పనికి రాని మొక్కలతో నిండిన కాలువ

ప్రభుత్వానికి నివేదిస్తాం..

వంశధార కాలువల అధునికీకరణ పనులు చేయలేమంటూ గుత్తేదారు లేఖ ద్వారా తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వానికి నివేదిస్తాం. కాలువలపై పలు నిర్మాణాలు చేపట్టాలి. రూ.20 కోట్ల మేర పనులు చేయక నిధులు మిగిలిపోయాయి.

– ప్రదీప్‌కుమార్, ఈఈ, వంశధార నరసన్నపేట డివిజన్

తీర ప్రాంత గ్రామాలకు రహదారి సౌకర్యం మరింత మెరుగుపరచడానికే.. పర్యాటకంగా అరసవల్లి, శ్రీకూర్మం, శాలిహుండం, కోటబొమ్మాళి, శ్రీముఖలింగం ప్రాంతాల అభివృద్ధికి గార, పోలాకి మండలం వనితమండలం గ్రామాల మధ్య ఆర్లేకిందట చేపట్టిన వంతెన నిర్మాణ పనులను వైకాపా ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం పర్యడిన అనంతరం ఎమ్మెల్యేలు గొండు శంకర్ (శ్రీకాకుళం), బగ్గు రమణమూర్తి (నరసన్నపేట) నిర్మాణ దశలో ఉన్న వంతెనను ఇటీవల పరిశీలించారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని హామీ ఇవ్వడంతో సమీప గ్రామాల ప్రజల్లో ఆశలు చిగురించాయి.

– న్యూస్‌టుడే, గార

చిగురించిన ఆశలు..!

● గార-వనితమండలం అసంపూర్తి వంతెన నిర్మాణానికి సన్నాహాలు
● అందుబాటులోకి వస్తే పర్యాటకంగా అభివృద్ధి

గార నుంచి పోలాకి మండలం వనితమండలం గ్రామానికి వంశధార నదిపై వంతెన నిర్మాణానికి గతంలో తెదేపా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది అందుబాటులోకి వస్తే శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల పరిధిలో గ్రామాల మధ్య దూరం బాగా తగ్గుతుంది. సుమారు రూ.72 కోట్ల అంచనాతో 2018లో పనులకు భూమిపూజ చేశారు. రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏడాదిలో 65 శాతం పూర్తయ్యాయి. అనంతరం ఏర్పడిన వైకాపా ప్రభుత్వం దీనిపై ఆసక్తి కనబరచలేదు. ఏళ్ల గడిచినా పనుల్లో పురోగతి లేదు.

ఇవీ ప్రయోజనాలు

★ గారలో ప్రతి మంగళవారం జరిగే సంతకు వ్యాపారులు నరసన్నపేట నుంచి వస్తారు. గార నుంచి నరసన్నపేటకు ప్రస్తుతం 20 కి.మీ. ప్రయాణించాలి.

★ వంతెనకు గార వైపు అనుసంధాన రోడ్డు నిర్మాణం చేపట్టాలి. దీన్ని గతంలో సీఎస్సీ రహదారికి అనుసంధానం చేసేలా చర్యలు చేపట్టినప్పటికీ స్థల సేకరణలో అడ్డంకులు నెలకొన్నాయి. ఫలితంగా గార-చింతాడ రోడ్డుకు అనుసంధానం చేయాల్సి వచ్చింది. నదీ తీరానికి, శ్మశానవాటిక వద్దకు వెళ్లడానికి రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలాకి వెళ్లాలంటే మరో 10 కి.మీ. అదనం.

★ వనితమండలం, మబగాం, కిల్లాం, తలసముద్రం, పూడివానిపేట, కత్తిరివానిపేట, దుబ్బకపేట, మాకివలస, గోపాలపెంట, జొన్నాం, డోల గ్రామాల ప్రజలకు గార మండలంతో ఎక్కువ సత్సంబంధాలు ఉన్నాయి. గార నుంచి మబగాం సమీప గ్రామాలకు వెళ్లాలంటే సుమారు 20 కి.మీ. ప్రయాణించాలి. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం పూర్తయితే ప్రయాణ దూరం 15 కి.మీ. వరకు తగ్గుతుంది. సమయం కలిసివస్తుంది. ఆయా ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుంది.

★ నదిలో స్తంభాల నిర్మాణం పూర్తయింది. వీటిపై కొంతవరకు బీమ్‌లు ఏర్పాటు చేశారు. నదికి అవతలి వైపు అనుసంధాన రోడ్డు నిర్మాణం కొంత మేర జరిగింది. గార- చింతాడ రహదారి నుంచి వంతెన వరకు రహదారి నిర్మాణానికి స్థల సేకరణ, ఆ ప్రాంతంలోని ప్రభుత్వ కార్యాలయాల తరలింపునకు తీసుకోవలసిన చర్యలను శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు కలెక్టరు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించామని ఆర్ అండ్‌బీ శాఖ డీఈ తిరుపతిరావు తెలిపారు.

★ అనుసంధాన రోడ్డు కారణంగా ఎమ్మార్సీ, పోలీసు స్టేషన్, వెలుగు, పశువైద్య కేంద్ర భవనాలను పూర్తిగా తొలగించాలి. వీటిని మరోచోటుకు తరలించాలి. సమీపంలోని పాత మండల పరిషత్ కార్యాలయ భవనంలో వెలుగు, ఎమ్మార్సీ, పశువైద్యం, వ్యవసాయ విభాగాలకు వసతి కల్పించి పాత తహసీల్దారు కార్యాలయ భవనాన్ని వ్యవసాయ కార్యాలయం, పోలీసు స్టేషన్ కార్యకలాపాలకు వినియోగించేలా అధికారులు దృష్టి సారిస్తే వాటికి వసతి సమస్య తీరుతుందని స్థానిక నేతలు సూచిస్తున్నారు.

వివిధ కార్యాలయాలకు కేటాయించనున్న పాత మండల పరిషత్ కార్యాలయం

క్రీడోత్సాహం

శ్రీకాకుళం అర్బన్, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. శ్రీకాకుళం నగరంలో స్కేటింగ్, హ్యాండ్‌బాల్, టెక్కలి డిగ్రీ కళాశాలలో నెట్‌బాల్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 550 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో స్కేటింగ్ పోటీలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, వ్యాయామోపాధ్యాయ సంఘ కార్యదర్శి సాంబమూర్తి ప్రారంభించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

శ్రీకాకుళంలో స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జీవీ రమణ

ఓపీఎస్ అమలు తేదీ ప్రకటించాల్సిందే

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: పాత పింఛను విధానం (ఓపీఎస్) అమలు తేదీని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ డిమాండు చేశారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పింఛను విధానంతో ఉద్యోగ విరమణ అనంతరం తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నందున ఓపీఎస్‌ను కొనసాగించాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ మూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ నాయకులు పి.తమ్మినాయుడు, పి.రామకృష్ణ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

ఆదిత్యాలయానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. పలువురు కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి.. గోశాలలో పూజలు చేశారు. ప్రసాదాల కౌంటర్లు, క్యూలైన్లలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. అర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.3.30 లక్షల ఆదాయం సమకూరింది.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

(c) eenadu

చెత్త నిర్వహణపై ఏదీ చిత్తశుద్ధి!

కొత్తూరు మండలం గూనభద్రలో చెత్త తరలింపు కేంద్రం వద్ద వర్షపునీరు నిలిచి పరిసరాలు అధ్వానంగా మారాయి. వైకాపా హయాంలో దీన్ని నిర్మించారు. ఇక్కడ వంశధార మినీ రిజర్వాయర్ కారణంగా రహదారి ఎత్తు పెంచడంతో వరద నీరు ఈ కేంద్రం వద్ద నిలిచిపోతోంది. చెత్త తరలింపు కష్టసాధ్యంగా మారిందని.. సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ బీవీఆర్ ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి రామనారాయణను 'న్యూస్‌టుడే' సంప్రదించగా రహదారిపై కల్వర్టు నిర్మించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

ఎగిసిపడిన చేపలు.. ఎగబడిన ప్రజలు

పోలాకి మండల పరిధిలోని చింతువానిపేట గ్రామం సమీపంలో వంశధార కాలువలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో చేపలు ఎగిసిపడి బయటకు వచ్చాయి. దీంతో చింతువానిపేట పరిసర గ్రామాల వారు అక్కడకు భారీగా చేరుకుని వాటిని పట్టుకున్నారు. ఒక్కొక్కరు కనీసం రెండు నుంచి మూడు కిలోల మేర పట్టి తీసుకెళ్లారు. – న్యూస్‌టుడే, పోలాకి

విఘ్నేశా.. వెళ్లిరావయ్యా..!

ఎల్ఎన్‌పేట మండలం మోదుగువలస కూడలిలో గ్రామ యువత ఏర్పాటు చేసిన 25 అడుగుల మహాగణపతిని ఆదివారం ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేశారు. కొత్తూరు అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో ప్రక్రియ చేపట్టారు. అంతకుముందు లడ్డూ వేలం పాట, అనంతరం బాలవినాయకుడి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

రాజ్యాధికారం ద్వారా హక్కుల సాధన

టెక్కలి, న్యూస్‌టుడే : రాజ్యాధికారం ద్వారానే హక్కులు సాధించుకోగలమని మాజీ ఎంపీ జేవీ హర్షకుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం పొందుపర్చిన రిజర్వేషన్లను రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయని ఆరోపించారు. ఇందుకు అనుగుణంగా సవరణలు, చట్టాలు చేస్తున్నారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు కన్నా పార్లమెంటుకే అధికారాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు, బలగ ప్రకాశరావు, చల్లా రామారావు, కృష్ణారావు, చిన్నారావు, నారాయణరావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	బ్రాస్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

ఉత్తరాంధ్రపై పాలకులు నిర్లక్ష్యం వీడాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం వీడాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టి పాటి వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో 'ఉత్తరాంధ్ర వెనుకబాటు- పాలకుల నిర్లక్ష్యం' అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వైకాపా, తెదేపా ప్రభుత్వాలు భాజపా ఆంధ్ర ప్రజల గౌరవం తాకట్టు పెట్టాయని ఆరోపించారు. ఉత్తరాంధ్రకు వెయ్యికోట్ల ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు విడుదలకు కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. పోలవరం నుంచి ఉత్తరాంధ్రకు సాగునీరు అందివ్వాలని, ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను తక్షణమే పూర్తి చేయాలని, ఉత్తరాంధ్రలోని 16 జీవనదులతో పాటు ఇతర నదుల సామర్థ్యం పెంచాలని తెలిపారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి, వలసలు నిరోధించి ఉత్తరాంధ్రను ఆదుకోవాలని చెప్పారు. సంఘ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ జగన్నాథం, వినోద్, రామారావు, శ్రీను పాల్గొన్నారు.

టెక్కలిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ న్యూడెమోక్రసీ నేతలు

పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా కలిశెట్టి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్‌కుమార్‌సింగ్ ప్రకటించారు. కమ్యూనికేషన్స్, ఐటీ శాఖల కమిటీల్లో ఈయనకు స్థానం దక్కింది. ఆయా శాఖల్లో అమలవుతున్న వివిధ కార్యక్రమాల తీరుతెన్నులను సమీక్షించడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులకు సంబంధించిన సూచనలు ఈ కమిటీ చేయనుంది. కలిశెట్టికి ఈ అవకాశం దక్కడం పట్ల ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

9 మంది ఎస్సైలకు బదిలీలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని 9 మంది ఎస్సైలకు స్థాన చలనం కల్పిస్తూ ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్నవారికి వేర్వేరు చోట్ల పోస్టింగులు ఇచ్చారు.

పేరు	బదిలీ స్థానం
పి.పైడినాయుడు	స్పెషల్‌బ్రాంచ్
కె.కృష్ణప్రసాద్	సీసీఎస్
కె.మధుసూదనరావు	సీసీఎస్
పి.సిద్ధార్థ్‌కుమార్	జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం
టి.రాజేష్	డీపీటీసీ అటాచ్ టాస్క్‌ఫోర్స్
వై.రవికుమార్	డీపీటీసీ
పి.కిశోర్ వర్మ	పోలీసు కంట్రోల్ రూం
ఏ.కోటేశ్వరరావు	పోలీసు కంట్రోల్ రూం
ఎం.డి.అమీర్ ఆలీ	డీసీఆర్‌బీ

హాకీ జట్టు శిక్షకుడిగా అనిల్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర మహిళల జట్టు శిక్షకుడిగా జిల్లాకు చెందిన అల్ల అనిల్‌కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ హాకీ సంఘ అధ్యక్షుడు బి.ఎం.చాణుక్యరాజు నియమించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా హాకీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పంచిరెడ్డి అప్పలనాయుడు, జరుగుళ్ల రమేష్ అభినందించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కొత్తూరు, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తూరు మండలం ఇరపాడుగూడలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సవర చిన్నారావు (35) మద్యానికి బానిసయ్యాడు. తరచూ తాగి వస్తుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఇటీవల ఆమె కుమార్తెను తీసుకుని అదే గ్రామంలోని పిన్ని ఇంటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సీఐ సీహెచ్ ప్రసాదరావు, ఎస్సై అహ్మద్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. తండ్రి సవర సన్నాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం పాలైన ఘటన ఇచ్ఛాపురం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈదుపురం గ్రామానికి చెందిన దేబోబెహర (60) ఆదివారం చేపలవేటకు వెళ్తుండగా.. వెనకగా ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందారు. ద్విచక్ర వాహనాన్ని గుర్తించి, ఘటనకు కారకులైన కవిటి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందినవారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గ్రామీణ ఎస్సై ఇ.శ్రీనివాస్ చెప్పారు.

బిల్లులివ్వకుండా బువ్వ పెట్టేదెలా..?

సోంపేట మండలం బారువ ఎస్సీ వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి భోజనాలకు నెలకు రూ.1.12 లక్షల వరకు ఖర్చవుతోంది. ఇతర నిర్వహణ ఖర్చులు, ట్యూటర్ల వేతనాలకు రూ.లక్షకుపైగా చెల్లింపులు జరగాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు సతమతమవుతున్నారు. జిల్లాలోని మిగిలిన వసతి గృహాల పరిస్థితి ఇలాగే ఉంది.

న్యూస్‌టుడే, సోంపేట, పలాస

ఎస్సీ వసతి గృహాల నిర్వహణ రోజురోజుకీ భారమవుతోంది. వైకాపా ప్రభుత్వం బిల్లుల చెల్లింపులపై శీతకన్ను వేయడంతో ఇప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమ వసతిగృహాల బిల్లులకు నిధులు కేటాయించింది. అయినప్పటికీ సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారుల తీరుతో ఇప్పటి వరకు చెల్లింపులకు అవకాశం లేకుండా పోయింది. ఈ ప్రభావం మెనూ అమలుపై కూడా పడుతోంది. అప్పులు చేసి పిల్లలకు భోజనం పెడుతున్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని ఎస్సీ వసతి గృహాలకు ఈ ఏడాది నుంచి బిల్లులు మంజూరు కాలేదు. ఆగస్టు వరకు రూ.3 కోట్లకు పైగానే చెల్లింపులు జరగాల్సి ఉంది. వైకాపా ప్రభుత్వం గతేడాది డిసెంబరు వరకే బడ్జెట్‌లో కేటాయింపులు చేపట్టింది. ఆ తర్వాత నిధులివ్వకుండా కాలయాపన చేసింది. ఇంతలో ఎన్నికల ప్రకటన రావడంతో బిల్లుల చెల్లింపులకు అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పచ్చాక బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఆ మేరకు వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమశాఖల ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. దీంతో ఆగస్టు వరకు బిల్లుల చెల్లింపులకు అవకాశం ఏర్పడింది. సాంఘిక సంక్షేమశాఖకు మాత్రం ఉన్నతాధికారులకు నుంచి ఇంకా బిల్లులు పెట్టుకునేందుకు జిల్లాకు అనుమతులు రాలేదు. ఫలితంగా దసరా సెలవులు డబ్బులు వచ్చే పరిస్థితి కనిపించట్లేదని సంక్షేమాధికారులు లబోదిబోమంటున్నారు.

జిల్లాలో వివరాలిలా..

- వసతి గృహాలు: 31
- కళాశాలలకు చెందినవి: 10
- ప్రీ మెట్రిక్: 21
- విద్యార్థులు: సుమారు 3 వేలు

- ఎస్సీ వసతి గృహాలకు రూ.కోట్లలో బకాయిలు
- గత ప్రభుత్వ నిర్వాకంతో తప్పని అవస్థలు

అన్నీ బకాయిలే..



- వసతి గృహాల్లో భోజనాల నిమిత్తం కళాశాల విద్యార్థులకు నెలకు రూ.1,600, పాఠశాల విద్యార్థులకు రూ.1,400, కాస్మాటిక్స్ చార్జీలుగా రూ.150 చొప్పున చెల్లించాలి.
- ఒక్కో హాస్టల్‌లో నలుగురు బోధకులు ఉన్నారు. వారికీ గత నవంబరు నుంచి వేతనాల్లేవు. వీరికి ఒక్కొక్కరికీ అప్పటి నుంచి నెలకు రూ.1,500 చొప్పున బకాయి ఉంది.



- పారిశుద్ధ్య, ఇతర నిర్వహణ ఖర్చులకూ నిధులు మంజూరు కాలేదు. జిల్లాలో వసతి గృహాలన్నింటికీ కలిపి నెలకు రూ.50 లక్షల వరకు రావాల్సి ఉంది.

నిధులు మంజూరు చేయాలి...

బిల్లులు రాకపోవడంతో వసతి గృహం నిర్వహణ కష్టంగా ఉంటోంది. వ్యాపారులు సరకులిచ్చేందుకు ఇబ్బంది పెడుతున్నారు. ఆడపిల్లలకు కాస్మాటిక్ చార్జీలూ ఇవ్వట్లేదు. గ్యాస్ కోసం సొంత డబ్బులు ఖర్చు పెడుతున్నాం. అధికారులు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి. – విజయలక్ష్మి, బలిజిపేటలోని వసతి గృహసంక్షేమాధికారి

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

బడ్జెట్‌లో బిల్లుల చెల్లింపులకు కేటాయింపులు జరిగాయి. నిర్వహణ పరమైన ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డైరెక్టర్ కార్యాలయం నుంచి అనుమతులు రాగానే నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం. – విశ్వమోహన్‌రెడ్డి, ఉప సంచాలకులు, సాంఘిక సంక్షేమశాఖ

'సనాతన ధర్మాన్ని భ్రష్టు పట్టించారు'

టెక్కలి, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ కల్తీతో ఆంధ్రుల పరువు, ప్రతిష్ఠ దిగజార్చారని ఏలూరుకు చెందిన రాజాశ్రమ పీఠాధిపతి, భారతీయ ధర్మ పరిషత్తు జాతీయ అధ్యక్షుడు కృష్ణచరణానంద భారతి అన్నారు. విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో టెక్కలి వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తిరుమల లడ్డూ కల్తీపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సనాతన ధర్మాన్ని భ్రష్టు పట్టించారన్నారు. హైందవ ధర్మాన్ని వైకాపా ప్రభుత్వం అవహేళన చేస్తూనే వచ్చిందని, అన్యమతస్థులను కీలక స్థానాల్లో నియమించి పెద్దఎత్తున కుట్రలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హనుమంతు ఉదయ్‌భాస్కర్, గేదెల చంద్రశేఖర్, మూల వేమన, మెట్ట జగన్నాథం, చంద్రం, శ్రీనివాస్, ఆకుల ప్రకాశ్ పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వర స్వామి గుడి ప్రాంగణంలో కృష్ణచరణానంద భారతి, ఆలయ కమిటీ సభ్యులు

తమ్మినేని వ్యాఖ్యలపై నిరసన

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో వినియోగించిన కల్తీ నెయ్యి విషయమై శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఇటీవల చేసిన వ్యాఖ్యలపై బాజపా నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కిసాన్ మోర్చా పిలుపు మేరకు జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం నగరంలోని బలగ శివాలయంలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆలయాన్ని గో పంచకంతో శుభ్రం చేసినట్లు తెలిపారు. వైకాపా హయాంలో రాష్ట్రంలోని దేవాలయాల్లో జరిగిన తప్పిదాలకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లక్ష్మణరావు, భాజపా నాయకులు ఎ.రవిబాబ్జి, ఎస్.ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గోపూజ చేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, నాయకులు

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. హరియాణా వేదికగా ఈ నెల 25 నుంచి 29 వరకు జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో గుడిపూడి ఛాయాకిరణ్(పలాస), నర్తిపురం ప్రవీణ్‌కుమార్(ఎచ్చెర్ల), బాలికల విభాగంలో బెండు జ్యోత్స్న(శ్రీకాకుళం) ఆంధ్రప్రదేశ్ తరపున జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. బాలుర జట్టు ప్రథమ స్థానం, బాలికల జట్టు ద్వితీయస్థానం సాధించింది. జిల్లా క్రీడాకారుడు ప్రవీణ్‌కుమార్ స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా క్రీడాకారులను భారత బాల్ బ్యాడ్మింటన్ సమాఖ్య ప్రధాన కార్యదర్శి వై.రాజారావు, కోశాధికారి చరణ్‌సింగ్, బాల్ బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీజీ కృష్ణంరాజు, శిక్షకుడు కోడి మోహన్, తదితరులు అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

అత్యాచార కేసులో నిందితుడి అరెస్టు

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దలంబ పంచాయతీ మూగుపురం గ్రామానికి చెందిన యువకుడు బుద్దల హేమసుందరరావును అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పరచినట్లు ఎస్సై అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. నిందితుడు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి ఈ నెల 16న ద్విచక్రవాహనంపై భావనపాడు బీచ్‌కు తీసుకువెళ్లి సమీప తోటలో అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడంతో శ్రీకాకుళం మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ బి.రాజశేఖర్ దర్యాప్తు చేపట్టారు. శనివారం అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పరిచామని, 14 రోజులు రిమాండ్ విధించడంతో ఆదివారం నిందితుడిని జిల్లా కేంద్ర కారాగారానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మృతిపై కుమార్తెల ఫిర్యాదు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం అంతరాబ గ్రామానికి చెందిన కమ్మకట్ల రామయ్య(83) శనివారం ఆకస్మికంగా మృతి చెందడంపై అనుమానం ఉందంటూ కుమార్తెలు పాతపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్సై టి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. రామయ్యకు పరపతి లక్ష్మి, ధర్మాన పద్మావతి, సుగ్గు పుష్పలత ముగ్గురు కుమార్తెలు. ఆయన భార్య మృతి చెందిన తర్వాత మూడో కుమార్తె పుష్పలత అంతరాబలో ఉంటున్న తండ్రిని చూసుకునేందుకు కుటుంబంతో సహా వచ్చి అక్కడే స్థిరపడ్డారు. దీంతో మరో ఇద్దరు కుమార్తెలు తండ్రి ఆస్తిని కాజేసేందుకు ఆమె వచ్చినట్లు గతంలో కోర్టులో కేసు కూడా వేశారు. ఇటీవల తండ్రిని తీసుకుని ఆఖరి కుమార్తె తన అత్తవారి గ్రామం వంబరవెల్లి వెళ్లారు. వృద్ధుడు అనారోగ్యానికి గురికావడంతో ఆయన్ను శనివారం శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఇద్దరు కుమార్తెలు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధుడి మృతదేహానికి ఆసుపత్రిలో శవ పరీక్ష నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

EENADU eClassifieds

REAL ESTATE

PLOT FOR SALE

ఆరవల్లి నెగిడి వీధిలో నార్త్ ఫేసింగ్‌లో ఉన్న 10.25 సెంట్ల మరియు రాగోలు జెమ్స్ హాస్పిటల్ దగ్గరలో 20 సెంట్ల అమ్మకమునకు కలవు. సంప్రదించండి. ✆ 7337227667.

JOBS

హరికృష్ణ హోండేర్ విజయవాడ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18k. ✆ 96405 28899, 96406 43899

30 మందికి వంట చేయుటకు అనుభవం కలిగిన ఆడ వంట మనిషి ఉండిపోయేలా కావలెను. 12 వేలు జీతం, వసతి, భోజన సదుపాయం కలదు. కైలాసగిరి వైజాగ్ ✆ 7093185792.

శ్రీకాకుళంలో ప్రముఖ School, Intermediate Collegeకు PRO కావలెను. Lecturers in Physics, Maths - M.Sc, B.Ed. Ph : +919515600257, +918790066683, +919440822639.

ట్రావెల్ హోండేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18 K. ✆ 85209 80099, 85208 74499.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ వైజాగ్ & శ్రీకాకుళంలో పనిచేయుటకు టీమ్ లీడర్స్ & ప్రమోటర్స కావలెను. అర్హత 10 to డిగ్రీ పాస్ (or) ఫెయిల్ 12 K to 25 K ఇంటర్వ్యూ 30th శ్రీకాకుళం Con. : 8919693509.

Receptionist and Waiter Jobs at Hote. Winsar Park, Opp KGH, Vizag: బాయ్స్ & గర్ల్స కావలెను. Interview at 10 am all days : బాయ్స్‌కు వసతి భోజనం M: 9849581868.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజలనుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /-
(GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

ఆ ఇద్దరు ఎవరో..!

– న్యూస్‌టుడే, పొందూరు

- పొందూరు మండలంలో రాజేశ్వరి పొదుపు సంఘంలో గతంలో బ్యాంకు లింకేజీ రూ.10 లక్షల రుణం తీసుకునేందుకు పొదుపు సంఘం తీర్మానంతో పాటు సీసీలతో ఫొటోలు, ఇతర పత్రాలు అందిస్తే రుణం వచ్చేందుకు 15 రోజులు దాటేది. ప్రస్తుతం అలాంటి ఇబ్బందుల్లేకుండా పొదుపు సంఘ తీర్మానంతో పాటు సంబంధిత పత్రాలు సీసీలకు అందిస్తే బ్యాంకు ద్వారా వారం రోజుల్లో రుణం వచ్చేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.
- జి.సిగడాం మండలంలో కాశీవిశ్వేశ్వర పొదుపు సంఘంలో బ్యాంకు లింకేజీ రూ.12 లక్షల రుణం కోసం గతంలో తీర్మానంతో పాటు అన్ని పత్రాలు అందించినా బ్యాంకు అధికారులు జాప్యం చేసేవారు. ఇప్పుడు ప్రభుత్వం బ్యాంకు అధికారులకు సకాలంలో సంఘాల సభ్యులకు రుణాలివ్వాలని ఆదేశాలివ్వడంతో త్వరగా లింకేజీ రుణాలు అందిస్తున్నారు.

గ్రామైక్య సంఘాలకు భరోసా..!

- పొదుపు సంఘాలకు కూటమి ప్రభుత్వం అండ
- యూనిట్ ఆధారంగా రుణాల మంజూరు

బ్యాంకు లింకేజీ రుణాలకు గతంలో పొదుపు సంఘాల సభ్యులు ఇబ్బందులు పడేవారు. బ్యాంకులు కూడా పొదుపు సంఘాలకు రుణాలిచ్చేందుకు గతంలో నిబంధనల పేరుతో ఇబ్బంది కల్పించేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక పొదుపు సంఘాల ఆర్థిక పురోగతిపై దృష్టి సారించింది.

పొందూరులో సమావేశమైన పొదుపు సంఘ సభ్యులు

యూనిట్ల ఏర్పాటుకు రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తుంది. గతంలో రూ.3 లక్షల వరకు మాత్రమే వడ్డీ రాయితీ ఉండేది. తాజాగా రూ.10 లక్షల వరకు వడ్డీ లేకుండా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అవసరం మేరకు ఇంకా అదనంగా రుణం మంజూరు చేయనున్నారు. దీనిపై త్వరలో విధి విధానాలు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యం: 36,133 సంఘాలకు రూ.18.21 కోట్లు

ఆగస్టు వరకు ఇచ్చినది: 8,720 సంఘాలకు రూ.5.38 కోట్లు

వీటికే అధిక ప్రాధాన్యం..

ప్రస్తుతం బ్యాంకు లింకేజీ ద్వారా సంఘానికి రూ.20 లక్షల వరకు రుణం ఇస్తున్నారు. ఆదాయం వచ్చే యూనిట్లు వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ఇతర పరికరాల కొనుగోళ్లకు ఈ రుణం తీసుకోవచ్చు. బ్యాంకుల వారీగా 9 నుంచి 12 శాతం వరకు వడ్డీ ఉంటుంది. జిల్లాలో 45,980 పొదుపు సంఘాలు ఉండగా ఈ ఏడాది బ్యాంకు లింకేజీ రుణాలు అధికారులు అందిస్తున్నారు. కోళ్లఫారం, వ్యవసాయం, చిల్లర దుకాణాలు, కూరగాయలు, దుస్తులు, గాజుల దుకాణాలు, డెయిరీ ఫామ్స్, తదితర యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకు లింకేజీ రుణాలు అధికంగా ఇచ్చేందుకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు.

సీసీఎల్ పద్ధతిలో మంజూరు..

రుణాలను క్యాష్ క్రెడిట్ లోన్ (సీసీఎల్) పేరిట మంజూరు చేస్తున్నారు. తీసుకున్న సొమ్ములో 65 శాతానికి పైగా తిరిగి చెల్లిస్తే కొత్తగా మరోసారి రుణం తీసుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా జీవనోపాధి మెరుగుపరుచుకోవచ్చు. గతంలో కన్నా ప్రస్తుతం పొదుపు సంఘాలకు త్వరగా రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్థిక పురోగతికి దోహదం

గతంలో రూ.3 లక్షల వరకు రుణానికి వడ్డీ రాయితీ ఉండేది. కొత్త విధానం ద్వారా రూ.10 లక్షల వరకు రుణానికి వడ్డీ రాయితీ ఉంటుంది. ఈ విధానం ఎంతో మందికి ఆర్థికంగా వ్యాపారాలకు ఉపయోగపడుతుంది. కొత్త విధానంపై విధి విధానాలు రావాల్సి ఉంది. పొదుపు సంఘాల ఆర్థిక పురోగతికి ఇది దోహదపడుతుంది. – ఆకుల నాగలక్ష్మి, బ్యాంకు లింకేజీ డీపీఎం, శ్రీకాకుళం

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

రామలింగేశ్వరస్వామిని తాకిన కిరణాలు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం బొరివంకలో వెలిసిన పురాతన ఆలయంగా పేరుగాంచిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం గర్భగుడిలో ఆదివారం ఉదయం సూర్య భగవానుడి లేలేత కిరణాలు తాకాయి. ఉదయం 6.10 నుంచి 6.15 గంటల సమయంలో అపురూప దృశ్యాన్ని చూసి భక్తులు పులకించారు.

సమస్యలు పరిష్కరిస్తాం

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని బెండి పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో ఆదివారం పలాస నియోజకవర్గం జనసేన సమన్వయకర్త దుర్గారావు సందర్శించారు. మురుగు కాలువలు, రహదారుల సక్రమంగా లేకపోవడం వల్ల ఇటీవల కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడినట్లు కాలనీ వాసులు తెలియజేయగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం:	9440437129
పలాస :	8008574279
కవిటి గ్రామీణం :	8309638875
పలాస గ్రామీణం:	7386408926
కంచిలి గ్రామీణం:	9704568738

సమస్య: వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ గ్రామానికి లోవోల్టేజీ సమస్యలు వేధిస్తున్నాయి. అదనంగా విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలి.
–చింత రాజు, సర్పంచి, కొమరల్తాడ
సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **– రమణ, విద్యుత్తు శాఖ, ఏఈ, వజ్రపుకొత్తూరు**
సమస్య: పలాస మండలం బంటుకొత్తూరులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది.
–యర్ర అప్పన్న
సమాధానం: పంచాయతీ అధికారులతో మాట్లాడి, నివారణ చర్యలు తీసుకుంటాం.
– ఐవీ రమణ, డీఎల్‌పీవో, న్యూస్‌టుడే, పలాస గ్రామీణం
సమస్య : మూడు నెలలుగా పెద్దాకుల-ఖజానావీధి మధ్య వీధి దీపాలు వెలగడం లేదు. **–అభి మహాపాత్ర, ఇచ్ఛాపురం**
సమాధానం : సమస్యను పరిష్కరిస్తాం.
–పి.కామేశ్, ఏఈ, ఇచ్ఛాపురం
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఆత్మీయ సమ్మేళనం.. కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ దరి చిన్నబాడాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1979-1980లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. కొంతమంది నాటి ఉపాధ్యాయులు సైతం హాజరయ్యారు. అప్పగి మధురస్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు.

శ్రద్ధగా చదివితే భవిష్యత్తు బాగు

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పలాస, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో ఉత్తమ విద్యార్థులుగా నిలవాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటలక్ష్మి అన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీకళాశాలలో స్వాగత వేడుకలు ఆదివారం నిర్వహించారు. శ్రద్ధగా చదుకుంటే భవిష్యత్తు బాగుటుందని సూచించారు. ఈ సందర్భంగా ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులంతా మొదటి సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ చేసిన నృత్యాలు ఆలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణపతి రావు, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటరమణ, వ్యాయామ సంచాలకులు డాక్టర్ పి.మధు, గ్రంథాలయాధికారి నర్సింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో అదరగొట్టారు

ఎమ్మెల్యేల నుంచి బహుమతి అందుకుంటున్న చిన్నారులు

కవిటి, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన యువజనోత్సవాల్లో కవిటికి చెందిన ఉన్నతి డాన్స్ అకాడమీ జానపద నృత్య బృందం ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. జిల్లాలో 8 నియోజకవర్గాల నుంచి కళాకారులు పోటీ పడ్డారు. ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, ఈశ్వరరావు బహుమతులు అందజేశారు.

పేరుకే బృందావనం..

ఇచ్ఛాపురం పట్టణంలోని బృందావనం కాలనీలో మౌలిక వసతులు లేక 300 జనాభా ఇబ్బందులు చవిచూస్తున్నారు. తెదేపా హయాంలో 2018లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకాల్లో పేదలకు, ఇల్లులేని వారికి గూడు కల్పించారు. ఇళ్లు నిర్మాణాలు పూర్తయినా.. రోడ్లు, వీధి దీపాలు లేకపోవడంతో వీరి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. 176 ఇళ్లు, 12 వీధులు విస్తరించి ఉన్న ఈ కాలనీలో వసతులు కల్పిస్తే మేలు చేసినట్లేనని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మోస్తరు వర్షానికి చెరువులా మారిన వీధి

త్వరితగతిన పరిష్కరించాలి .. నడిచేందుకూ దారిలేని కాలనీలో జీవనం సాగిస్తున్నాం. ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే స్పందించడం సంతోషం తాగునీరు, రోడ్లు, కాలువల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి. **–కె.బుజ్జి, స్థానికుడు**

సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం .. బృందావనం కాలనీలో సమస్యలు తెలిశాయి. ఎమ్మెల్యే సూచనలమేరకు సమస్యను కౌన్సిల్‌స మావేశ అజెండాలో పొందుపరచడం జరిగింది. సోమవారం దీనిపై నిర్ణయం తీసుకుంటాం.
– ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అడుగుపెడితే అవస్థలమయం..!

ఈ ప్రాంతంలో రోడ్లు లేకపోవడంతో మోస్తరు వర్షం కురిసినా.. మట్టి రోడ్లు కావడంతో బురదమయంగా మారి.. నీరు నిలిచి రాకపోకలు చేయలేని దుస్థితి. విద్యుత్తు సరఫరా లేకపోవడంతో మరో ప్రధాన సమస్య స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రయితే అంధకారం తప్పదు. ఆ సమయంలో విష కీటకాలు, సర్పాలు చుట్టూ ఉన్న మొక్కలు, పొదల నుంచి వచ్చేస్తాయని స్థానికులు వాపోయారు. ఖైకాపా హయాంలో వీరి సమస్యలు పట్టించుకోకపోవడంతో అధికారులు సైతం స్పందించలేదు. ఇటీవల ఎమ్మెల్యే అశోక్ విషయం తెలుసుకుని తొలుత విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ నల్లి రమేష్ లేఖ రాశారు. దీంతో చర్యలు ప్రారంభమయ్యాయి. కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అనంతరం తదుపరి అడుగులు పడనున్నాయి.

మొక్కలు, పొదలతో అధ్వానంగా కనిపిస్తున్న రోడ్డు

పదిరోజుల్లోనే దెబ్బతిన్న కల్వర్టు

పలకలు పరిశీలిస్తున్న జనసేన నాయకుడు రాజు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కల్వర్టు నిర్మించిన పది రోజుల్లోనే రెండు పలకలు దెబ్బతినడంతో జనసేన నాయకులు దాసరి రాజు మండిపడ్డారు. వాటిని పరిశీలించి నాణ్యతాలోపంపై సంబంధిత అధికారులు, గుత్తేదారు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణం ప్రధాన రహదారి (పాత జాతీయరహదారి) నుంచి ఎల్లమ్మగుడివీధికి చేరుకునేందుకు కల్వర్టు ఉంది. దానిని పునరుద్ధరించి కల్వర్టుపై పలకలు వేయగా వాహనాల రాకపోకలకు రెండు పలకలు దెబ్బతిన్నాయి. ఈ విషయమై ర.భ.శాఖ జేఈ మోహనరావును వివరణ కోరగా చూసి సమస్య పరిష్కరిస్తామన్నారు.

రాకపోకలకు స్తంభం అడ్డు

ఖజానావీధి-పోకల వీధి మధ్య రోడ్డు వేయక ముందు మట్టి రహదారి ఉండేది. ఆ సమయంలో విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేశారు. తరువాత సిమెంట్ రోడ్డు నిర్మించడంతో స్తంభం మధ్యలోకి వచ్చేసింది. దాంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏమరుపాటుగా ఉంటే స్తంభాన్ని ఢీకొంటారని, ప్రత్యామ్నాయ చోటులో ఏర్పాటు చేసి, ఇక్కడ నుంచి దానిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఏఈ గోవిందరావు తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అధ్వాన మార్గం.. ప్రయాణం నరకం

వజ్రపుకొత్తూరు మండలం హుండి నుంచి మంచినీళ్లపేట మధ్య రోడ్డు పలు చోట్ల పాడై ప్రమాదకంగా మారింది. 10 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు ప్రస్తుతం అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలతో పలు ద్విచక్ర వాహన ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్నపుడు గుంతల్లో వాహనాలు దిగడంతో ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రద్దీగా ఉన్న ఈ మార్గంలో తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖ జేఈ విక్రమ్ మాట్లాడుతూ మంచినీళ్లపేట రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.
-న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

దాహం.. దాహం

పలాస మండలం శాసనాం గ్రామస్థులు తాగునీటి కోసం మూడు రోజులుగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వీధి కుళాయిలు ద్వారా నీరు రావడం లేదని, దూరంలోని బావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి శరత్ దృష్టికి తీసుకెళ్లగా బోరు పాడైందని, బాగుచేసి సోమవారం కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామని చెప్పారు.
- న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

హమ్మయ్యా..సమస్య తీరింది!

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారి నుంచి కేసరిపడ మీదుగా రేఖదేవీపురం వరకు ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. అర్జునాపురం వద్ద ఉన్న కాలువ నుంచి నీరు దారిపైకి చేరుతుండటంతో రోడ్డు ధ్వంసమవుతోంది. నారాయణబట్టి గ్రామం వద్ద వంతెన కూలిపోవడంతో అర్జునాపురం మార్గమే ప్రత్యామ్నాయంగా మారింది. దీంతో మార్గం పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించకపోవడంతో గ్రామస్థులే పరిష్కరించుకున్నారు. ఆదివారం ఉదయం గ్రామస్థులు, మోటార్ యూనియన్ సభ్యులు కలిసి రహదారిపై ఉన్న గుంతలను చిన్న రాళ్లతో పూడ్చడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

'ఆఖరి కిడ్నీ' కవితకు ప్రశంసలు

నాగేశ్వరరావును సన్మానిస్తున్న కళా వేదిక ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని బైపల్లి మాజీ సర్పంచి, రంగస్థల కళాకారుడు మడ్డు నాగేశ్వరరావు రాసిన 'ఆఖరి కిడ్నీ' కవితకు ప్రశంసలు దక్కాయి. అనకాపల్లి జిల్లా కేంద్రంలో శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో 139వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా ఆదివారం నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. నేటి సమాజాన్ని వణికిస్తున్న కిడ్నీ వ్యాధి పై కవిత రూపంలో ఆయన వినిపించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావుని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డా.ప్రతాప్, కన్వీనర్ కె.రమావతి జ్ఞాపికతో పాటు ప్రశంస పత్రాన్ని అందించి ఘనంగా సత్కరించారు. పలువురు అభినందనలు తెలిపారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మొక్కలు సంరక్షణతో మానవాళి మనుగడని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. మండలంలోని రిట్ట పాడులో శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్ర బాబురావు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, నాయకులు, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం సాధారణ సమావేశం నేడు

పలాస, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు పురాధ్యక్షుడు గిరిబాబు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రామారావు తెలిపారు. అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ● ఇచ్ఛాపురం పురపాలకసంఘ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు పురాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే సర్వసభ్య సమావేశంలో పురాభివృద్ధికి సంబంధించిన చర్చలు జరుగుతాయన్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు

గత 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేసి, నిబద్ధత సేవలు అందించి అందరి మన్ననలు పొంది నేడు పదవీ విరమణ చేయుచున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ... మీ శేష జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ...

శ్రీ శివ బిసాయి గారు
S.A(Odiya), ZPHS, M.S.పల్లి
స్వగ్రామం: కుసుంపురం, కవిటి మండలం

భార్య
శ్రీమతి ఊర్మిళ బిసాయి

కుమారుడు: వినోద్‌కుమార్ బిసాయి తల్లి: దమయంతి బిసాయి

కుమార్తె	అల్లుడు	మనుమలు
ధనలక్ష్మి బిసాయి	ఘనశ్యామ్ సాహు	ఓమ్ స్వరూప్ సాహు, చిన్మై స్వరూప్ సాహు

అక్కా చెల్లెళ్లు	బావలు
హారావతి సాహు	-
వేదవతి దొళాయి	జనార్దన దొళాయి
అనసూయ బిసాయి	శరత్‌చంద్ర బిసాయి
మేనక మజ్జి	హరిబంధు మజ్జి

మీరియు బంధుమిత్రుల అభినందనలతో...

Head Master & Staff - ZPHS, M.S.Palli

పదవీ విరమణ శుభాకాంక్షలు

ఉపాధ్యాయ వృత్తిలో నీతి, నిజాయితీ, అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొంది నేడు పదవీ విరమణ చేయుచున్న శ్రీ శివ బిసాయి గారికి శుభాకాంక్షలు తెలుపుతూ..
మిత్రులు, శ్రేయోభిలాషులు

శ్రీ శివ బిసాయి గారు
SA (Odiya), ZPHS ఎం.ఎస్.పల్లి, కంచిలి మండలం
స్వగ్రామం : కుసుంపురం, కవిటి మండలం

ప్రొఫెసర్ డా॥ ప్రభాకరిణ్ణ వరక	భగీరథ దొళాయి బొరివంక	ధనుంజయ మజ్జి మజ్జిపుట్టుగ
భాస్కర్ దొళాయి కొక్కెచిపుట్టుగ	పురంధర బిసాయి కుసుంపురం	ధీజ్ఞి బిసాయి కుసుంపురం
త్రిలోచన బిసాయి కుసుంపురం	కేశవ పురియా వరక	బృందావన్ దొళాయి సోంపేట
మార్కండేయ బిసాయి కుసుంపురం	ప్రకాష్ బిసాయి కుసుంపురం	శ్రీధరమూర్తి బిసాయి ప్రగడపుట్టుగ	జగన్ దొళాయి కుసుంపురం

డబ్ల్యూటీఎస్‌కు పురస్కారం

అవార్డు అందుకుంటున్న దామోదర్

సోంపేట, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులు, నిరుద్యోగులకు సేవలందిస్తున్న 'వే టూ సక్సెస్' సంస్థకు ఇండియన్ నేషనల్ ఎక్స్‌లెంట్ పురస్కారం గుర్తింపు లభించింది. ఆదివారం విశాఖపట్నం కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో వ్యవస్థాపకుడు చీడిపల్లి దామోదర్ అవార్డుని అందుకున్నారు. ఈ సంస్థ ఏటా 5వేల మందికి పైగా విద్యార్థులు, నిరుద్యోగ యువత సేవలందుకుంటున్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

పలాస, న్యూస్‌టుడే: యువత సేవాగుణం అలవర్చుకోవాలని లయన్స్‌క్లబ్ కార్యదర్శి మాధవరావు అన్నారు. కాశీబుగ్గ ప్రశాంతిసాయి స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆవరణలో వైద్యులు పాపినాయుడు, సుశీల కుమార్తె నీరజ జన్మదినం సందర్భంగా 96 మంది విద్యార్థులు అన్నదానం చేశారు.

గ్రామస్థుల శ్రమదానం

పనికిరాని మొక్కలు తొలగిస్తున్న గ్రామస్థులు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం చిన్న నీలావతి గ్రామస్థులు ఆదివారం శ్రమదానం చేశారు. గ్రామంలోని చెత్తా చెదారాన్ని సేకరించి దూరంగా పారబోశారు. మహిళలు, యువకులంతా కలిసి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పనికిరాని మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో వీరాస్వామి, తాతారావు, గౌరకల లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఈకేవైసీ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ కిడ్నీ పరిశోధన కేంద్రం అత్యవసర విభాగంలో డయాలసిస్ చేసుకుంటున్న రైతు ఎర్రయ్యకు ఉద్యాన శాఖ విస్తరణాధికారి నవీన్ చౌదరి ఆదివారం ఈకెవైసీ చేయించారు. పలాస మండలం గురుదాసుపురం పంచాయతీకి చెందిన ఎర్రయ్య ఉద్యాన పంటకు సంబంధించి ఈ ప్రక్రియ జరిగింది.

స్నేహితుడికి ఆపన్నహస్తం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : కవిటి మండలం బొరివంక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో 'పద' చదువుకున్న పూర్వ విద్యార్థులు స్నేహితుడు, జగతి గ్రామానికి చెందిన రాజబాబుకు సాయం చేశారు. ఆయన కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతుండటంతో ఆదివారం రూ. 36,100లు అందజేశారు.

పోలీసులకు చిక్కిన ద్విచక్ర వాహనాల దొంగ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సునీల్ మహంతి విలేకరుల సమావేశంలో ఈ నెల 27వ తేదీ అర్ధరాత్రి ఫారెస్ట్ కూడలి వద్ద ఎస్సై లక్ష్మణ్ బెహరా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడిని తనిఖీలు చేయగా ద్విచక్రవాహన వివరాలు ఆయన వద్ద లేవు. విచారించగా నిందితుడు వాహనం చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతడు చెప్పి వివరాలతో గతంలో దొంగిలించిన మరో 19 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పలాసకు చెందిన రామిరి రమునందన్‌గా పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి, న్యాయస్థానానికి తరలించినట్లు తెలిపారు.

ఆటో చోదకుడికి గాయాలు... కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస మండలం రామకృష్ణాపురం జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఆటో బోల్తాపడటంతో చోదకుడు తారకేశ్వరరావుకు గాయాలయ్యాయి. హరిపురం నుంచి పలాస వైపు వస్తుండగా రహదారి రక్షణ గోడకు తగిలి బోల్తాపడటంతో ప్రమాదం జరిగింది. 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో మందస యూటీఎఫ్ విజయం

హరిపురం (మందస), న్యూస్‌టుడే : యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో మందస మండల జట్టు విజయం సాధించింది. ఫైనల్‌లో కొత్తూరు జట్టుతో తలపడి గెలుపొందింది. గుంటూరులో అక్టోబరు 4, 5, 6 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. జిల్లా కోశాధికారి రవికుమార్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.

విజేతగా నిలిచిన మందస యూటీఎఫ్ జట్టు

రూపక్‌రెడ్డికి నివాళి

మాట్లాడుతున్న ఎంపీ ప్రదీప్ పాణిగ్రహి

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా సరిహద్దు ఒడిశా గ్రామమైన పితాతొళికి చెందిన రూపక్ రెడ్డి ఇటీవల అమెరికాలో బోటు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన సంతాప సభ ఆదివారం నిర్వహించగా ఆంధ్రా, ఒడిశా రాజకీయ ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. రూపక్ తండ్రి ఉపాధ్యాయులు పెదిని కవిరాజురెడ్డికి ధైర్యం చెప్పారు. ఉద్యోగ రీత్యా కవిరాజు ఇచ్ఛాపురం మండలం మండపల్లిలో ఉంటున్నారు. ఒడిశా బ్రహ్మపుర ఎంపీ ప్రదీప్ పాణిగ్రహి, చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్‌సామంత్రాయ్ హాజరై నివాళులర్పించారు.

కెరటాల ఉద్ధృతి.. ఇదీ తీరం గతి

వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట, హుకుంపేట తీరం రోజురోజుకు కోతకు గురవుతుంది. ఒకప్పుడు ఇసుక తిన్నెలు ఇక్కడ ఎత్తుగా ఉండేవని గత కొన్ని రోజులుగా కెరటాల ఉద్ధృతి పెరిగి సముద్రం కొంత ముందుకు రావడంతో కిలోమీటరు పైగా తీరం కోతకు గురైంది. ఒకప్పుడు తీరానికి రక్షణగా సరుగుడు చెట్లు, తాటి చెట్లు ఉండేవని ప్రస్తుతం తీరం వెంబడి ఎలాంటి రక్షణ లేకపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల పలుమార్లు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం నేపథ్యంలో సముద్రపు అలలు భారీగా రావడంతో తీరం కోతకు గురైన చిత్రమే ఇది.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

గిరిజన సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకులు

మందస, న్యూస్‌టుడే: గిరిజన సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గిరిజన అభ్యుదయ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు డిమాండు చేశారు. మండలంలో ఆదివారం పలు మండలాల గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లపై తీర్మానం చేశారు. ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలల్లో రెండు చొప్పున ఆంగ్ల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడంతోపాటు రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని తెలిపారు. ఇతరుల ఆక్రమణలో ఉన్న గిరిజన భూములను తిరిగి ఆదివాసీలకు అప్పగించాలని కోరారు. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు తారురోడ్లు నిర్మించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నరసింహారావు, రమేష్, జగ్గారావు, యేసయ్య, భాస్కరరావు, తులసీదాసు, రాజారావు, పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

ఉపాధ్యాయ వృత్తి నిర్వహణలో 40 సంవత్సరాలుగా నిశిస్వమైన సేవలందించి ఎంతోమంది విద్యార్థులకు ఉత్తములుగా తీర్చిదిద్ది, కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి అందరి మన్ననలు పొంది నేడు ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా మీ భావిజీవితం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ...

శ్రీమతి బమ్మిడి తులసమ్మ గారు, M.A., B.Ed.,
స్కూల్ అసిస్టెంట్ (S.S), M.P.U.P. School,
బ్రాహ్మణతర్ల, పలాస మండలం.

భర్త: దుంపల రామారావు
Rtd. Dy. Director

కుమారుడు
అల్లుడు - కుమార్తె

డా॥ D. వెంకట రమణ్
అసిస్టెంట్ ప్రొఫెసర్,
సిద్ధార్థ మెడికల్ కాలేజీ, విజయవాడ

వి. ప్రవీణ్‌కుమార్ - అనితారాణి
B.Tech, MBA M.Tech
చి. సాయిప్రతీక్, చి. శివాన్షి

(c) eenadu

టెక్కలి

• టెక్కలి • నరసన్నపేట • పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
9441426248
8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? టెక్కలిలోని కోటచిన్నబాబు క్వార్టర్స్ రోడ్డులో విద్యుత్తు దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. పంచాయతీ యంత్రాంగం స్పందించాలి. - **స్థానికులు**

● తక్షణమే సిబ్బందిని పంపించి వీధి దీపాలకు మరమ్మతులు జరిపిస్తాం. - **జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి, టెక్కలి** – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

? నౌపడ గ్రామంలో పలు వీధుల్లో విద్యుత్తు స్తంభాలకు పనికిరాని మొక్కలు, తీగలు అల్లుకోవడంతో తరచూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. - **చిక్కాల శ్రీకాంత్, గ్రామస్థుడు**

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **చిన్నారావు, విద్యుత్తు ఉద్యోగి, నౌపడ** – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

? పోలాకి పంచాయతీ వెదుళ్లవలసలో ఐదు రోజులుగా కుళాయిల నుంచి తాగునీరు సరఫరా అవడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. - **కె.టి.రామారావు, స్థానికుడు**

● సమస్యను సర్పంచికి తెలియజేసి, తాగునీరు అందేలా కృషి చేస్తాం. - **జి.పద్మావతి, ఈవోపీఆర్డీ, పోలాకి** – న్యూస్‌టుడే, పోలాకి

సోమేశ్వరుడికి ఆదిత్యుని స్పర్శ

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక ఉమా సోమేశ్వరాయలంలో శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఆలయ గర్భగుడిలో ఉన్న శివలింగానికి ఆదివారం ఉదయం భానుడి కిరణాలు తాకడాన్ని చూసిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఏటా రెండు సార్లు ఇలా జరుగుతుందని అర్చకులు వి. విజయశంకర్ తెలిపారు.

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికలు

ప్రతిభ చూపిన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో జిల్లాస్థాయి పాఠశాల క్రీడా పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ ఆధ్వర్యంలో నెట్‌బాల్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్ క్రీడలకు సంబంధించి బాలబాలికలను 14, 17, 19 ఏళ్ల వయో విభాగాల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావు, వ్యాయామోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, కేకే రామిరెడ్డి, కె.రఘునాథరావు, రాజా, నాగరాజు, వెంకటరమణ, పీవీ రమణ, జె. కృష్ణారావు, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి మండలంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జూదం ఆడుతున్న 13 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. భగవాన్‌పురం శ్మశానవాటిక వద్ద ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.2,110 స్వాధీనం చేసుకోగా, అక్కువరం చెరువుగట్టుపై ఆరుగురిని అదుపులోకి తీసుకోగా వారి వద్ద రూ.1,520 నగదు పట్టుబడినట్లు చెప్పారు.

వీడని గ్రహణం..

నియోజకవర్గ కేంద్రమైన నరసన్నపేటలో రహదారులపైనే కూరగాయల విక్రయాలు కొనసాగుతున్నాయి. వాణిజ్యపరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో కూరగాయల మార్కెట్ లేకపోవడం స్థానికులకు శాపంగా మారింది. దాదాపు రెండు వందలకు పైగా చిరు వ్యాపారులు తోపుడు బండ్లతో కూరగాయలు, పండ్లు విక్రయిస్తున్నారు. దశాబ్దాలుగా సమస్యతో పలువురు సతమతమవుతున్నా పాలకులు చొరవ చూపడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలమవుతున్న సముదాయ భవనాలు

రెండు మాత్రమే ఉపయోగం

దుకాణ సముదాయం నిర్మించేందుకు వ్యాపారుల నుంచి కొంత మొత్తాన్ని గ్రామ పంచాయతీ అధికారులు అప్పట్లో సేకరించారు. వినియోగంలో లేని వాటికి అద్దె చెల్లించడంపై వ్యాపారులు అభ్యంతరం తెలిపారు. ఈ వివాదం కోర్టు వరకు చేరింది. 51 దుకాణాల్లో తొలి వరుసలో ఉన్న రెండు మాత్రమే ప్రస్తుతం వినియోగిస్తున్నారు. మార్కెట్‌తో పాటు కాలేజీ రోడ్డుపై చిరు వ్యాపారాలు విక్రయాలు చేపట్టడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ప్రత్యేకాధికారితో పాటు మండల పరిషత్, గ్రామ పంచాయతీ సిబ్బంది కాలేజీ రోడ్డుపై ఉన్న దుకాణాలను వెనక్కి జరపాలని హెచ్చరికలు జారీ చేశారు.

ప్రజాధనం వృథా

నరసన్నపేట పట్టణంలో 2001లో కూరగాయల దుకాణాలు అగ్ని ప్రమాదానికి గురవడంతో పక్కా నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అప్పట్లో రూ.10 లక్షలతో 51 దుకాణాలను విశ్వేశ్వరయ్య కూరగాయల మార్కెట్ పేరుతో నిర్మించారు. వినియోగానికి నోచుకోక పోవడంతో క్రమేణా అవి శిథిలావస్థకు చేరాయి. 2012లో ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు గ్రామ పంచాయతీ అధికారులు రూ.5 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. అనంతరం వీటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

వెంటాడుతున్న నిధుల లేమి

దుకాణ సముదాయం ఆధునికీకరణకు నిధుల లేమి వెంటాడుతోంది. ప్రస్తుతం ఉన్న భవన సముదాయం తొలగించేందుకు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుంది. మళ్లీ దుకాణ సముదాయం నిర్మించేందుకు రూ.కోటి వరకు అవసరం ఉంటుంది.

వినియోగంలోకి రాని వైనం

రహదారికి ఆనుకుని కూరగాయల దుకాణాలు

ప్రతిపాదనలు పంపించాం

విశ్వేశ్వరయ్య కూరగాయల మార్కెట్ ఆధునికీకరణకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. నిధుల లేమి కారణంగా నిర్మాణాలకు అటంకం కలుగుతోంది. ప్రతిపాదనలు పంపించాం.
– **దాక్షాయణి, ఈవో, నరసన్నపేట మేజర్ పంచాయతీ**

ఏడాదిగా నిరుపయోగం

నందిగాం మండలం కవిటిఅగ్రహారంలో గ్రామ సచివాలయం వీధిలోని బోరు ఏడాది నుంచి పనిచేయడంలేదు. దీంతో తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి.. తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రమణబాబు వద్ద ప్రస్తావించగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి బాగు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

పెరుగుతున్నా పట్టించుకోరా

పోలాకి మండలం ఎస్.ఎల్.పురం గ్రామంలో మామిడి తోటల వద్ద విద్యుత్తు నియంత్రిక చుట్టూ పనికిరాని మొక్కలు, తీగలు అల్లుకోవడంతో ప్రమాదకరంగా మారింది. వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందే మేల్కొని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. సిబ్బందికి తెలియజేసి పనికిరాని మొక్కలు తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పోలాకి

బయటకు వెళ్లాలంటే భయం

కొత్తపేట, కోటబొమ్మాళి ప్రాంతాల్లో గ్రామ సింహాల స్వైరవిహారంతో సర్వత్రా బెంబేలెత్తిపోతున్నారు. ఏ వీధుల్లో చూసినా శునకాలు గుంపులుగా సంచరిస్తుండటంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లలేని పరిస్థితి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వీటి సంఖ్యను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేస్తామని స్పష్టంచేశారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

నిత్య వెలుగులు నియంత్రించరూ

పోలాకి మండల పరిధిలోని బార్జిపాడు గ్రామంలో 5 వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథాతో పాటు, పంచాయతీకి అధికంగా బిల్లులు వచ్చే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు.

పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సర్పంచి సోమేశ్వరరావు మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో స్విచ్ బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పోలాకి

పరిష్కారం కాకుండా.. అయినట్లు

కొత్తూరు మండలం వెంకటాపురంలో ప్రభుత్వ బావిని కొందరు ఆక్రమించారని గ్రామానికి చెందిన త్రినాథరావు అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. బావి చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోయి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని అందులో పేర్కొన్నారు. యంత్రాంగం సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా అయినట్లు తన చరవాణికి సందేశం పంపించారని ఆయన తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో పావని వద్ద వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుడికి సత్కారం

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాత పొన్నుటూరుకు చెందిన ఉపాధ్యాయుడు కె.తిరుమలరావు ఆదివారం అనకాపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనంలో 'అన్ని దిశల్లో నిర్భయ గురుతులే' అనే గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కళావేదిక అధ్యక్షుడు డా.కె.ప్రతాష్, ఇతర సభ్యులు తిరుమలరావును సన్మానించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక జై దుర్గా భవానీ ట్యాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ట్యాక్సీ స్టాండ్ ఆవరణలో వచ్చేనెల 3 నుంచి 12 వరకు వేడుకలు జరుపుతామని వేద పండితులు మావుడూరు జగదీష్‌బాబు తెలిపారు. ఏటా కళాశాల కూడలి వద్ద నిర్వహించే ఈ ఉత్సవాలు ఈ ఏడాది ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ట్యాక్సీ స్టాండ్ వద్ద నిర్వహిస్తామన్నారు.

కొండచిలువ హతం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రావివలస గ్రామంలో ఆదివారం సాయంత్రం కొండచిలువ కలకలం రేపింది. జడ్పీ ఉన్నత పాఠశాల పక్కనున్న ఓ ఇంటి ఆవరణలోకి పాము ప్రవేశించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. యువత దానిని హతమార్చారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

నరసన్నపేట, న్యూస్‌టుడే: నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొంటారని అధికారులు తెలిపారు. సమస్యలపై ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు.

4 రోజులు ప్రాయశ్చిత్త కార్యక్రమాలు

సారవకోట, న్యూస్‌టుడే: చీడిపూడి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు ప్రాయశ్చిత్త కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు తెలిపారు. తిరుమల మహాప్రసాదం అపవిత్రం జరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మండల ప్రత్యేకాధికారికి సన్మానం

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట మండల ప్రత్యేకాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.లోకనాథంను మండల దళిత సంఘ నాయకులు ఆదివారం సన్మానించారు. స్థానిక దళిత సంఘ భవనంలో సంఘనాయకులు సమావేశమై భవనానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, మండలంలోని దళిత వాడల్లో శ్మశాన వాటికలకు స్థలాలు సమకూర్చాలని కోరారు. సంఘ అధ్యక్షుడు జి.సింహాచలం, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు జి.రామారావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కొత్తూరు, న్యూస్‌టుడే: వైకాపా కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరు మండలంలోని దిమిలి గ్రామంలో ఇటీవల వైకాపా నాయకుడు శంకరరావు తల్లి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని శాంతి ఆదివారం పరామర్శించారు. వైకాపా నాయకులు చింతాడ సూర్యనారాయణ, కురిగాం సర్పంచి అశోక్, యుగంధర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి గ్రామానికి చెందిన బైరి జయరాం కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో మంచానికే పరిమితం కావడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు రూ.50 వేలు విరాళాలు సేకరించి ఆదివారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన మరో డోల కాళిదాసు మెదడువ్యాపు వ్యాధితో ఇటీవల మృతి చెందడటంతో అతడి కుటుంబానికి రూ.45 వేలు ఆర్థిక సాయం చేశారు. తెదేపా నాయకుడు లుకులాపు రాంబాబు పాల్గొన్నారు.

కీర్తిచక్ర పురస్కారం తెలుగు వారికి గర్వకారణం

వెంకయ్యనాయుడికి జ్ఞాపిక అందిస్తున్న రామ్‌గోపాల్‌నాయుడు, కుటుంబ సభ్యులు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామానికి చెందిన కీర్తిచక్ర అవార్డు గ్రహీత మల్లా రామ్‌గోపాల్‌నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు విశాఖపట్నంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రామ్‌గోపాల్‌నాయుడికి కీర్తిచక్ర పురస్కారం రావడం తెలుగు వారికి గర్వకారణమని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. అనంతరం మాజీ ఉపరాష్ట్రపతికి జ్ఞాపిక అందించారు.

ఘనంగా సత్యసాయి వ్రతాలు

పాతపట్నం, న్యూస్‌టుడే: చిన్నమల్లిపురంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం సాయి వ్రతాలు నిర్వహించారు. పాలకొండ సేవా సమితి ప్రతినిధి ఎన్.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయి చెప్పిన సత్యం, ధర్మం, శాంతిని అలవరుచుకోవాలని సూచించారు. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సహారా ఖాతాదారులకు చెల్లింపులు చేపట్టాలి

పాతపట్నం, న్యూస్‌టుడే: సహారా ఖాతాదారులకు చెల్లింపులు చేపట్టాలని పలువురు ఏజెంట్లు కోరారు. పాతపట్నంలో శ్రీకాకుళం పరిధిలోని ఏజెంట్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. సహారా ఏజెంటు బి.సత్యనారాయణ మాట్లాడుతూ.. ఖాతాదారులకు 12 ఏళ్లుగా చెల్లింపులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఈ అంశంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.అప్పలనర్సయ్య, సీహెచ్.నీలకంఠం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు రంగం సిద్ధం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి జాతరమహోత్సవాల నేపథ్యంలో కోటబొమ్మాళిలో రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలకు రంగం సిద్ధమైంది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి మూడురోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు. ఇతర జిల్లాలకు చెందిన ఏడుగురు రిఫరీలతో పాటు జిల్లాకు చెందిన సుమారు 20 మంది వ్యాయామోపాధ్యాయుల పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని కూటమి నాయకులు బోయిన రమేష్, కల్లి లక్ష్మణరెడ్డి, నాగయ్యరెడ్డి పేర్కొన్నారు.

4, 5 తేదీల్లో సంజాయిషీ ఇవ్వాలి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడిన మండలంలోని 21 మంది క్షేత్ర సహాయకులపై వేటుపడింది. ఈ మేరకు డ్వామా అధికారులు వారిని తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు ఈనెల 21న ఆదేశాలు జారీచేశారు. వచ్చే నెల 4, 5 తేదీల్లో సదరు క్షేత్ర సహాయకులు సంజాయిషీ ఇవ్వాలని కోటబొమ్మాళి ఏపీవో గుజ్జల హరిప్రసాద్ ఆదివారం పేర్కొన్నారు.

అక్రమంగా బాణసంచా విక్రయం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కురుడు కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా రమణ అనే వ్యక్తి బాణసంచా విక్రయిస్తుండగా ఆదివారం దాడిచేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. రూ.4 వేల విలువైన సరకు స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని అరెస్టు చేసినట్లు వివరించారు.

పని చేసే కార్యకర్తలకు ప్రశంసలు

మాజీ శ్రీధర్‌కు జ్ఞాపిక అందిస్తున్న కూటమి నాయకులు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: తెదేపాలో పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే గోవింద రావు కుమారుడు, తెదేపా యువ నాయకుడు మామిడి సాయిగణేష్ అన్నారు. పార్టీ యాప్ ద్వారా వివిధ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లిన పెద్దవడ్డాపురం తెదేపా నాయకుడు మాల్తీ శ్రీధర్ కృషిని గుర్తించి మంత్రి లోకేశ్ పంపించిన జ్ఞాపికను ఆదివారం ఆయనకు అందించారు. ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు అనసాన రాజశేఖర్‌రెడ్డి, సలాన శరత్ పాల్గొన్నారు.

ఇరపాడులో పద్యనాటక పోటీలు

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఇరపాడులో గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆదివారం పద్యనాటక పోటీలు నిర్వహించారు. గుర్రం జాషువా కళా బృందం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేదెల సుందరనారాయణ, సల్ల మన్మథరావు, సభ్యుడు పోర్న గోవిందరావు ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు బహుమతులు అందజేశారు.

జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

హిరమండలం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి ఆ సంఘ అధ్యక్షురాలు అనురాధ, కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. ఆదివారం సుభలయ ఆర్ఆర్‌కాలనీలో సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. కార్యవర్గ సభ్యులు రజని, శ్రీలత, శ్రీదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

జలుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని చల్లవానిపేటకు చెందిన పట్ట శ్రీరాములు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు గురించి తెలుసుకున్న స్థానిక మైత్రీ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం రూ.27,500 సహాయాన్ని అందించి మానవత్వం చాటుకున్నారు.

అమ్మవారి ఆలయంలో సంప్రోక్షణ

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం మేజరు పంచాయతీ పెద్దకోరాడ నీలమణి దుర్గాదేవి ఆలయంలో ఆదివారం పురోహితులు సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. వచ్చే నెల 3 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ పురోహితులు పవిత్ర జలాలతో ఆలయ పరిసరాలు శుద్ధి చేసి అమ్మవారిని పసుపు ముద్దలతో అలంకరించి శాంతి హోమం నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో పెద్దకోరాడ నీలమణి దుర్గమ్మ

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

భగవద్గీత శ్లోక పఠన పోటీలు

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: నగరంలో పాతశ్రీకాకుళం ఏపీహెచ్‌బీకాలనీలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహించనున్నట్లు మిషన్ జిల్లా సమన్వయ కర్త వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 50 పాఠశాలల్లో పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు యోగ్యతాపత్రాలు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 94405 46282 నంబరును సంప్రదించాలని కోరారు.

తెరపై ఈనాడు

● **కీర్తన:** సరిపోదా శనివారం ● **కీర్తిక:** దేవర ● **కిన్నెర సినీమాక్స్:** సత్యం సుందరం ● **ఎస్‌వీసీ (రామలక్ష్మణ):** దేవర ● **సూర్యమహల్:** దేవర ● **సరస్వతి:** దేవర ● **చంద్రమహల్:** మత్తు వదలరా-2 ● **మారుతి:** దేవర

– న్యూస్‌టుడే, అరసవల్లి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

అమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని అక్కులపేట-వేణమ్మపేట సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సూర్యారావు అన్నారు. ఆదివారం సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, సత్యసాయి సేవా సమితి సభ్యులతో కలిసి మండాది ప్రభుత్వ పాఠశాల, రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

పాఠశాల వద్ద మొక్కలు నాటుతున్న సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సూర్యారావు, విద్యార్థులు

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారడంతో గుండె లయ తప్పుతోందని, వాటికి అందరూ దూరంగా ఉండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని పురుషుల డిగ్రీ కళాశాల నుంచి జెమ్స్ ఆసుపత్రి వైద్యులు విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. తెదేపా ఉపాధ్యక్షుడు చిట్టి మోహన్, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడు శీర రమణయ్య, ప్రిన్సిపల్ లక్ష్మీలలిత, డైరెక్టర్ డాక్టర్ కె.సుధీర్, హృద్రోగ నిపుణులు తదితరులు పాల్గొన్నారు. ★ కిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ డా.గూడేన సోమేశ్వరరావు, హృద్రోగ నిపుణులు డాక్టర్ కిల్లి సతీష్, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి గుండె వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం కిమ్స్ నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

సాగు పట్టాభూములకు రహదారి సౌకర్యం ఏర్పాటు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని షేర్‌మహ్మద్‌పురం రెవెన్యూ గ్రామ పరిధిలో 2006లో మండలంలోని వివిధ గ్రామాల దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన సాగు డీపట్టా భూములకు ఆదివారం రెవెన్యూ అధికారులు రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇటీవల వికలాంగుల కోసం మూడో శుక్రవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగానికి భూమి పొందిన వికలాంగులంతా తమ భూములకు రహదారి సౌకర్యం కల్పించాలని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పష్టిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించడంతో తహసీల్దార్ ఎ.సింహాచలం, మండల సర్వేయర్ డి.సుభాషిణి భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి వికలాంగులకు 112 సర్వే నంబరులో కేటాయించిన 40 ఎకరాల కొండ పోరంబోకు భూములకు కొండపైన ఉన్న భూములను పొక్లెయిన్‌తో చదును చేసి రహదారి ఏర్పాటు చేశారు. వీఆర్‌వో శ్రీనివాసరావు, గురుగుబెల్లి సహదేవుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం.. శిలాఫలకానికే పరిమితం..!

న్యూస్‌టుడే, అమదాలవలస గ్రామీణం

ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో రహదారి నిర్మాణానికి వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి శాసన సభాపతి తమ్మినేని సీతారాం శిలాఫలకం వేశారు. ఏళ్లు గడిచినా పనులు మాత్రం ప్రారంభించలేదని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా నిర్మించాలని కోరుతున్నారు.

● అధ్వానంగా తొగరాం-రాగోలు మార్గం ● పట్టించుకోని అధికారులు

రూ.3.25 కోట్లతో చేపట్టినా..: ఆమదాలవలస మండలం తొగరాం-రాగోలు రోడ్డు నిర్మాణాన్ని ఎన్‌ఆర్‌డీపీ నిధులు రూ.3.25 కోట్లతో 10 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు అప్పటి స్పీకర్ శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ముందుకు సాగ లేదు.

గోతులైనా పూడ్చండి: ఈ మార్గం పరమ అధ్వానంగా ఉందని, అధికారులు కనీసం గోతులైనా పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. పెద్ద పెద్ద గోతులు కావడంతో వాహన చోదకులతో పాటు పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

గోతులమయంగా మారిన రహదారి

నిర్మాణానికి చర్యలు: తొగరాం-రాగోలు రహదారి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు నిర్మాణ గుత్తేదారే దీన్ని కూడా నిర్మించాలి. ఈ విషయాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు చేపడతాం.

–అంజనేయ నాయక్, ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, ఆమదాలవలస

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించాలి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: యోగా సాధన ద్వారా ఎన్నో లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ మందిరంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.సురేఖ, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కేదారినాథ్, ఉపాధ్యక్షుడు తంగి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 28న జరిగిన పాఠశాలల క్రీడా పోటీల్లో ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. హాకీ విభాగంలో ప్రతిభ కనపరిచిన తరుణ్‌కుమార్, మనోజ్‌కుమార్, మహబూబ్‌లు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ట్రిపుల్ ఐటీ డైరక్టర్ డా. కె.వి.జి.డి.బాలాజీ, ఏవో మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ, చౌదరి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కేజీబీవీ ఉపాధ్యాయినికి పురస్కారం

జి.సిగడాం, న్యూస్‌టుడే: తెలుగు రచయితల వేదిక సభ్యురాలు, జి.సిగడాం కస్తూర్బా గాంధీ విద్యాలయ తెలుగు ఉపాధ్యాయిని లలితారెడ్డికి అరుదైన గౌరవం లభించింది. శ్రీశ్రీ కళావేదిక అనకాపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి గౌరీ గ్రంథాలయంలో జరిగిన ఈ జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో వేదికపై లలితారెడ్డి అక్షరమే ఆయుధం పేరిట కవితా గానాన్ని ఆలపించి ఈ పురస్కారం పొందారు. ఈ కళావేదిక అధ్యక్షుడు డా.కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమాదేవి, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, ఈ-వేమన అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జి.ఎల్.ఎన్.శాస్త్రి, కార్యదర్శులు తదితరులు లలితారెడ్డిని శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో ఆదివారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ ఉషారత్నకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది, వాండ్రంగి కొండలరావు తదితరులు ఆమెను అభినందించారు.

రహదారిపై గొయ్యి పూడ్చివేత

ఆమదాలవలసలోని లక్ష్మీనగర్ ప్రధాన రహదారిపై గొయ్యిని మున్సిపాలిటీ సిబ్బంది పూడ్చివేశారు. తాగునీటి ప్రధాన పైపులైన్ లీకవ్వడంతో మున్సిపల్ సిబ్బంది మరమ్మతుల కోసం గొయ్యిని తవ్వి పని పూర్తయిన తరువాత పూడ్చకుండానే విడిచిపెట్టేశారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న విషయమై ఈ నెల 22న 'ఈనాడు'లో 'తవ్వేశారు... వదిలేశారు..!' శీర్షికతో సమస్యా చిత్రాన్ని ప్రచురించడంతో మున్సిపాలిటీ అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. –న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

రక్తదాన శిబిరాల ఏర్పాటుకు సన్నాహాలు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న భారీ ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించేలా సన్నాహాలు చేయాలని ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. రణస్థలంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల రక్తనిధి ప్రతినిధులంతా కలిసి రక్తదాన శిబిరాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వీలైనంత ఎక్కువగా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రెండు జిల్లాల రెడ్‌క్రాస్, విశాఖ ఎన్టీఆర్, రిమ్స్, జెమ్స్, విజయశ్రీ రక్తనిధి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో సమావేశమైన రక్తనిధి ప్రతినిధులు

ప్రపంచ హృదయ దినోత్సవం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: నగరంలో పాతశ్రీకాకుళంలో ప్రశాంతి వృద్ధ జనాశ్రమంలో ఆదివారం రోటరీక్లబ్ శ్రీకాకుళం, జెమ్స్‌ఆసుపత్రి సంయుక్త నిర్వహణలో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వృద్ధ జనాశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హృదయ వైద్య నిపుణులు డా.వై.జశ్వంత్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ముని శ్రీనివాసరావు, కార్యదర్శి దూసి సంతోష్, జెమ్స్ ఆసుపత్రి డీజీఎం ఎస్.విజయభాస్కర్, వృద్ధజనాశ్రమం అధ్యక్షుడు డా.కొంచాడ సోమేశ్వరరావు పాల్గొన్నారు. ★ లయన్స్ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం గ్రామీణ మండలం కల్లేపల్లిలో సన్‌రైజ్ హాస్పిటల్ అధినేత డా.బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.

ఆదిత్యుని సేవలో అనిశా ఎస్పీ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని అవినీతి నిరోధక శాఖ(అనిశా) ఎస్పీ ఎం.రజని ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం అని వెట్టి మండపంలో అర్చకులు ఆమెను ఆశీర్వదించి.. తీర్థ ప్రసాదాలు అందించారు. ఈవో వై.భద్రాజీ స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

ఉచిత మెగా వైద్యశిబిరం

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీకాకుళం సేవా భారతి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో వైద్యులు వనజాక్షి, అశోక్‌కుమార్, దంత వైద్యులు కె.వేదవ్యాస్, సాయి సందీప్‌లు పలువురికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. సేవా భారతి సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీలు విజయవంతం చేయాలి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: మండల స్థాయి చెకుముకి పోటీలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1న స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉదయం 9.30 గంటలకు జరిగే చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షకు 8, 9, 10 తరగతుల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల స్థాయి విజేతలు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ పరీక్ష మండల విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో జరుగుతుందని, అనంతరం ఎంపీడీఓ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక ప్రగతికి ధ్యానం సోపానం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: శారీరిక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక ప్రగతికి ధ్యానం ఏకైక మార్గం అని స్పిరిచ్యువల్‌లైఫ్ సొసైటీ ఏ మిషన్ ఆఫ్ శ్రీరామచంద్ర అధినేత ఎస్.ఆర్ మూర్తి అన్నారు. నగరంలో అరసవల్లికూడలి దరి ఇందిరావిజ్ఞాన భవన్‌లో ఆదివారం ఉచిత ధ్యాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

రామలక్ష్మి సేవలు చిరస్మరణీయం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పేరు పొందడంతో పాటు రుగ్మతలు లేని సమాజ స్థాపనకు కె.రామలక్ష్మి పాటుపడ్డారని, ఆమె సేవలు చిరస్మరణీయమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సమాఖ్య నాయకురాలు దివంగత రామలక్ష్మి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రచించిన 'నేనేక కవిత్వం' పుస్తకాన్ని కథా రచయిత ఎ.అప్పల నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.కిశోర్‌కుమార్, ఎ.ఆజాశర్మ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్ సేవలు అభినందనీయం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: వ్యవసాయశాఖ జేడీ కె.శ్రీధర్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన వ్యవసాయశాఖ జేడీగా పదవీవిరమణ సభలో ఆయన పాల్గొని శ్రీధర్‌ను ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు.

కనకధారా స్తోత్రం ప్రవచనం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం పాలకొండ రోడ్డులోని కోదండరామాలయ ప్రాంగణంలో ఆదివారం కనకధారాస్తోత్రం ప్రవచనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంస్కృత పండితుడు డా.బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి ఆదిశంకరుల వైభవం, వారి రచనల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపనిషన్మందిరం సంస్థ అధ్యక్షుడు గుమ్మానగేష్, పతంజలి శాస్త్రి సంతోష్‌కుమార్ శాస్త్రిని సత్కరించారు.

కళింగ భవన్‌లో రక్తదాన శిబిరం

శ్రీకాకుళం అర్బన్: అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరం శాంతినగర్ కాలనీలోని కళింగ భవన్‌లో ఆదివారం రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, భాజపా నాయకులు పైడి వేణుగోపాలం, డా.సూర్యం, అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంత విద్యాశాఖ అధికారిని సస్పెండ్ చేయండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పోస్టింగ్ తదితర అంశాల్లో అక్రమాలకు పాల్పడిన అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారిని సస్పెండ్ చేయాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) రాష్ట్ర ఛైర్మెన్ కె.హరికృష్ణ, నాయకులు కొండయ్య, జి.శివానంద రెడ్డి తదితరులు ఒక ప్రకటనలో కోరారు.

పేరులోనే మానవత్వం శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: 'మానవత' పేరులోనే మానవత్వం ఉందని.. సంస్థ సేవలు మరింత విస్తృతం కావాలని ట్రస్టు హాస్పటల్ అధినేత డా.బుడుమూరు అన్నాజీరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుండెను పరిరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కార్యవర్గం ఎన్నిక

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండల పాఠశాలల శానిటరీ వర్కర్ల సంఘ మండల స్థాయి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ఎం.ఆర్.సి. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఎ.ఐ.టి.యు.సి. జిల్లా ఉపాధ్యక్షుడు రాంబిల్లి సత్యనారాయణ సమక్షంలో మండల పాఠశాలల శానిటరీ వర్కర్ల సంఘం అధ్యక్ష రాలిగా కోరాడ పార్వతి, ప్రధాన కార్యదర్శిగా నల్లా పద్మ, కోశాధికారిగా డొంక రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. పాఠశాలల శానిటరీ వర్కర్లు కోటమ్మ సీత, ఎస్.రమణమ్మ, టి.రాధ, రేష్మ, సంతోషికుమారి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ డా॥ పైడి మల్లేశ్వరరావు గారు
MBBS (MD Micro)
Dy. DM & H.O., వైద్య ఆరోగ్య శాఖ ,టెక్కలి
జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ హోదాలలో, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అందరి ప్రశంసలు అందుకుని Dy. DM & HO హోదాలో నేడు పదవీ విరమణ చేస్తున్న మీకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ... మీ భావి జీవితం నిండు నూరేళ్లు అష్ట ఐశ్వర్య ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని మనసారా ఆకాంక్షిస్తూ...
భార్య: శ్రీమతి డా॥ పైడి హేమలత
Medical Officer, PHC, Peddagantyada, VSP
అమ్మ: పైడి సత్తెమ్మ
కుమార్తె - అల్లుడు
డా॥ కూటికుప్పల మాధవి (గాతిమి) - MD Community Medicine
డా॥ భాస్కర్ - M.S., M.Ch., Plastic Surgery